క్లుప్తంగా

ఆలయ చైర్మన్‌గా రాజశేఖర్



కార్వేటినగరం: శ్రీసుబ్రహ్మ ణ్యస్వామి ఆలయ చైర్మన్‌గా ఆర్.రాజశేఖర్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తానన్నారు. అదే విధంగా ఆలయ కమిటీ సభ్యులుగా రాధాకృష్ణ, గోవిందస్వామి, వినయ్, అమరావతి, సెల్వి, హరిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ కృష్ణనాయక్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర రక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కోటేశ్వరరావు

పుత్తూరు: మానవుని మనుగడకు అవసరమైన ఓజోన్ పొర రక్షణ అందరి బాధ్యతని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీల నుంచి, ఏసీలు, రిఫ్రిజరేటర్ల నుంచి వెలువడే రసాయనాలతో భూమి చుట్టూ రక్షణ కవచంలా ఉండే ఓజోన్ పొర దెబ్బతింటుందని తెలిపారు. ఓజోన్ పొర క్షీణిస్తే చర్మ క్యాన్సర్, కంటి జబ్బులు వస్తాయని తెలిపారు. ఓజోన్ పొరను కాపాడుకోవడానికి ప్లాస్టిక్ వాడకాన్ని గణనీయంగా తగ్గించాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు హరిబాబు, శాంసన్‌రాజు, సుజన, వెంకటకృష్ణయ్య, షర్మిల, శంకర్రావు, విష్ణుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించి ఓజోన్ పొరను కాపాడుకోవచ్చని పాలసముద్రం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీనాక్షి తెలిపారు. మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో హెచ్‌ఎం మీనాక్షి, ఉపాధ్యాయులు ధనరాజ్, గుణశేఖర్, ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

తమిళనాట రానున్నది ఏఐఏడీఎంకే ప్రభుత్వం



మాట్లాడుతున్న వలర్మతి

నగరి: తమిళనాట రానున్నది ఏఐఏడీఎంకే ప్రభుత్వమేనని తమిళనాడు మాజీ మంత్రి వలర్మతి అన్నారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి అన్నాదొరై 117వ జయంతి వేడుకను పురస్కరించుకొని ఆ పార్టీ ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శి ఆంబ్రోస్ విల్సన్ ఆధ్వర్యంలో నగరి బస్టాండు ప్రాంగణంలో నిర్వహించిన భారీ అన్నదాన, వస్త్రదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తొలుత అన్నాదొరై చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో అన్నా కార్మిక సంఘం తరఫున ప్రమాదాల బారిన పడే కార్మికులకు ఏటా రూ.లక్ష అందిస్తున్నామన్నారు. ఆంబ్రోస్ విల్సన్ మాట్లాడుతూ అన్నాదురై చూపిన మార్గంలో పార్టీ ముందుకెళుతుందన్నారు. రత్నం, బృందా, తవమణి ఆశీర్వాదం, రవూఫ్, రఘు, జహంగీర్, పెరియస్వామి, శ్రీనివాసులు, ముత్తువేల్, గుణశేఖర్, మునియమ్మ, గోపాల్, సేటుసుబ్రమణి, గోపి, సురేష్, మాసిలామణి, బాలయ్య, చంద్రన్, వేణు, పయని, మనిగండన్, వేలాయుధం పాల్గొన్నారు.

నగరిలో బెంగళూరు బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు



అవస్థల పయనం

నగరి నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులకు ఉన్నది ఒక్కటే ఆర్టీసీ బస్సు. అది కూడా సత్యవేడు డిపో నుంచి ప్రారంభమై నగరి మీదుగా బెంగళూరు వెళుతుంది. అక్కడి నుంచి బస్సు నగరికి వచ్చేలోపే ప్రయాణికులతో నిండిపోతుంది. దీంతో నగరి నుంచి బెంగళూరుకు వెళ్లాల్సిన వారికి తిప్పలు తప్పడం లేదు. ముందస్తుగా బుక్ చేసుకుంటే సీట్లు ఉంటాయని కండక్టర్లు చెబుతున్నా గ్రామాల నుంచి వచ్చే పలువురు ఆ దిశగా అడుగులు వేయలేకపోతున్నారు. – నగరి

- బెంగళూరుకు వెళ్లాలంటే తప్పని యాతన
- నగరి మీదుగా వెళ్లేది ఒక్కటే బస్సు
- సత్యవేడు డిపో నుంచి వస్తుండడంతో సీట్లు ఖాళీ ఉండవు
- ముందస్తుగా సీట్లు బుక్ చేసుకోవాలి
- రాత్రిళ్లు బెంగళూరు నుంచి నగరికి రావాలంటే నరకయాతన
- బస్సు సర్వీసులు పెంచాలంటున్న ప్రయాణికులు

బెంగళూరుకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, పిల్లల వద్దకు వెళ్లాల్సిన తల్లిదండ్రులు నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. వీరిలో బుకింగ్ విజ్ఞానం ఉన్నవారు ముందస్తుగా సీట్లు బుక్ చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వెళ్లే పలువురికి ఆ వివరాలు తెలియక పోవడంతో సీట్లులేని బస్సులో తోసుకుంటూ లోపలకు వెళ్లి సీట్లు లేక నిలబడే ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది. దీంతో నగరి నుంచి ఆర్టీసీ బస్సులో బెంగళూరుకు వెళ్లాలంటే ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.

రాత్రిపూట రావాలంటే నరకం

తిరుగు ప్రయాణంలో రాత్రిపూట బెంగళూరులో నుంచి బయలుదేరి నగరికి చేరుకునే ప్రత్యక్ష సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పుత్తూరుకు మాత్రమే సర్వీసులు ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆ బస్సుల్లో పుత్తూరుకు రావాలంటే రాత్రి 3 గంటలకు రావాల్సిందే. అక్కడి నుంచి నగరికి 4.30 గంటల వరకు బస్సులు ఉండవు. దీంతో రోడ్డుపైనే ప్రత్యక్ష నరకం కనిపిస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పుత్తూరు నుంచి 14, నగరి నుంచి 1

పుత్తూరు నుంచి బెంగళూరు వెళ్లడానికి ఏపీఎస్‌ఆర్టీసీ వారు ఒక అల్ట్రా ఎక్స్‌ప్రెస్, ఐదు ఎక్స్‌ప్రెస్‌లు నడుపుతుంటే కర్ణాటక ఆర్టీసీ వారు ఏడు బస్సులు నడుపుతున్నారు. ఇదిగాక సత్యవేడు నుంచి బెంగళూరుకు వెళ్లే బస్సు సర్వీసు ఒకటి పుత్తూరు మీదుగానే వెళుతుంది. నగరి నుంచి బెంగళూరు వెళ్లడానికి సత్యవేడు నుంచి వచ్చే బస్సు మినహా మరో బస్సు లేదు. దీంతో ఇక్కడి నుంచి వెళ్లే ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. పుత్తూరు వరకు నడుస్తున్న సర్వీసులలో కొన్నింటినైనా నగరికి పొడిగించాలని రవాణా శాఖను కోరుతున్నారు. రోజువారీ ప్రయాణికుల సంఖ్య దృష్ట్యా ఈ సమస్యను పరిష్కరించడం అత్యవసరమని, బస్సు సర్వీసులు పెంచితే పలువురికి ఉపశమనం కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

బస్సు సర్వీసులు పెంచాలి



బెంగళూరుకు బస్సులో వెళ్లి రావాలంటే పలు సమస్యలు ఎదురవుతోంది. రాత్రిళ్లు బెంగళూరు నుంచి నగరికి రావాలంటే డైరెక్ట్ బస్సు లేదు. పుత్తూరు వరకే బస్సు పరిమితమవుతోంది. రాత్రి 3 గంటలకు బస్సు పుత్తూరుకు వస్తే 4.30 వరకు మరో బస్సు కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. పుత్తూరు–బెంగళూరు, బెంగళూరు–పుత్తూరు బస్సుల్లో మరో సర్వీసును నగరి మీదుగా నడిపితే ఎందరికో ఉపయోగపడుతుంది.

– హరిపోతన్, నగరి

నిలబడి వెళ్లాల్సిన వస్తోంది



బెంగుళూరుకు వెళ్లాలంటే వేకువ జామున ఒక్కబస్సు మాత్రమే ఉంది. అది సత్యవేడు డిపో నుంచి వస్తుండడంతో నగరికి చేరే సరికే ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. మరో బస్సు లేకపోవడంతో ఆ రద్దీలోనే నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. బెంగళూరుకు వెళ్లేందుకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేయాలి.

– కుమార్, పుదుపేట

విద్యార్థులకు క్రీడా పోటీలు



చెస్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓలు

నగరి: మండలస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం చెస్ ఆడి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంఈఓలు మాట్లాడుతూ క్రీడలు మేధాశక్తిని, స్నేహ భావాన్ని పెంచుతాయన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాలలో క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. బాల్ బ్యాడ్మింటన్‌లో నగరి క్రీడాకారులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. మండల స్థాయిలో విజేతలైనవారు డివిజన్ స్థాయిలో పాల్గొంటారన్నారు. అక్కడ ప్రతిభ కనబరిస్తే జిల్లా స్థాయికి ఆపై రాష్ట్ర స్థాయిలో పాల్గొనే అవకాశం వస్తుందన్నారు. సమావేశానంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 320 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మండల క్రీడాకమిటీ కన్వీనర్ మణి, పీడీ సురేష్‌ల నేతృత్వంలో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్యామలాదేవి, వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

దారి కోసం దౌర్జన్యం

– రాతికూసాలు ధ్వంసం చేసి రైతుపై దాడి



ధ్వంసమైన రాతి కూసాలు



బాధిత రైతు చెంగల్రాయులు

వెదురుకుప్పం: పట్టా భూమిలో అక్రమంగా దారి ఏర్పాటు చేసే ప్రయత్నాన్ని అడ్డుకుని ప్రతిఘటించిన ఓ రైతుపై టీడీపీకి చెందిన 15 మంది ఏకంగా దాడికి తెగబడ్డారు. దీంతో భయాందోళనకు గురైన బాధిత రైతు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసి, న్యాయం చేయాలని కోరారు. బాధిత రైతు చెంగల్రాయులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ తెట్టుగుంట పల్లెకు చెందిన గురసాల చెంగల్రాయులుకి గ్రామానికి సమీపంలోని వివిధ సర్వే నంబర్లలో భూమి కలదు. ఇందులో వేరుశనగ సాగు చేసినట్లు రైతు తెలిపారు. అయితే తెట్టుగుంట పల్లె గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు తమ పొలాలకు దారి ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో అదే గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత వద్ద మంతనాలు జరిపారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని రోడ్డు వేసేందుకు పూనుకున్నారు. దీంతో రైతు చెంగల్రాయులు వద్దకు వచ్చి దారి వేసేందుకు సహకరించాలని కోరారు. అయితే పట్టా భూమిలో దారి వేసేందుకు వీల్లేదని తెలిపారు. అధికారులు సైతం సెటిల్‌మెంట్ భూమిలో దారి వేసేందుకు కుదరదని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఆ నాయకుడు టీడీపీ వర్గీయులను రెచ్చగొట్టి, బెదిరింపులకు దిగారు. పొలంలో నాటిన రాతి కూసాలను ధ్వంసం చేశారు. సుమారు 35 రాతి కూసాలను ధ్వంసం చేసి రూ.75 వేలు నష్టం చేసినట్లు రైతు గగ్గోలు పెడుతున్నాడు. బావి వద్దకు వెళుతూ బాధిత రైతు చెంగల్రాయులు అన్న జి.మునిరాజ గమనించి రాతి కూసాలను పగులగొట్టడాన్ని చూసి వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అతనిపై దాడికి తెగబడ్డారు. గత ఆగస్టు 6వ తేదీన కూడా రాతి కూసాలను పగులగొట్టినట్లు పేర్కొన్నారు. జరిగిన ఘటనపై వెదురుకుప్పం పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు మంగళవారం మీడియాకు తెలిపాడు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కబడ్డీ విజేత జడ్పీ తమిళ హైస్కూల్



పుత్తూరులో కబడ్డీ ఆడుతున్న బాలికలు



వడమాలపేట విజేత జట్లతో ఉపాధ్యాయ బృందం

పుత్తూరు: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఎస్‌జీఎఫ్ కబడ్డీ సీనియర్ బాలుర పోటీలలో గేట్‌పుత్తూరు జడ్పీ తమిళ హైస్కూల్ విజేత కాగా వేదవ్యాస ఉన్నత పాఠశాల రన్నర్‌గా నిలిచింది. సీనియర్ బాలికల విభాగంలో గేట్ పుత్తూరు హైస్కూల్ విజేతగా నిలిచింది. జూనియర్ బాలుర విభాగంలోనూ గేట్‌పుత్తూరు విన్నర్స్‌గా నిలవడం విశేషం. జూనియర్ బాలికల విభాగంలో కేబీఆర్‌పురం హైస్కూల్ విజేత కాగా నారాయణ హైస్కూల్ రన్నర్‌గా నిలిచింది. ఎంపికైన జట్ల నుంచి డివిజన్ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. పోటీలను మండల కో–ఆర్డినేటర్ గోపికృష్ణ, పీడీలు జయప్రకాష్, గుర్రప్ప, కేశవులు, సుబ్రమణ్యం, వేలు, మోహన్, షంషుద్దీన్, ఆరుముగం, రాజశేఖర్, రేఖారాణి, గోవిందమ్మ పర్యవేక్షించారు.

వాలీబాల్ విజేత వడమాలపేట

వడమాలపేట (పుత్తూరు): వడమాలపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా జరిగిన మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలలో అండర్–14 వాలీబాల్ బాలికల పోటీలలో, అండర్–17 బాలికల కబడ్డీ పోటీలలో వడమాలపేట జట్లు విజేతగా నిలిచాయి. తడుకు, ఎస్బీఆర్‌పురం పాఠశాలలు రన్నర్స్‌గా నిలిచాయి. గెలుపొందిన జట్లు నుంచి మండల స్థాయి జట్లను ఎంపిక చేశారు. ఈ జట్లు డివిజన్ స్థాయిలో జరిగే పోటీలలో వడమాలపేట మండలం తరఫున ప్రాతినిధ్యం వహిస్తాయి. పోటీలను ఎంఈఓలు పద్మావతమ్మ, తులసీరామ్, హెచ్‌ఎం కరుణా నవనీతం, పీడీలు పర్యవేక్షించారు.

ఓజోన్ పొరను రక్షించుకోవాలి

నగరి: ఓజోన్ పొరను రక్షించుకోవడం అందరి బాధ్యత అని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎకో క్లబ్ ఆధ్వర్యంలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులతో కళాశాల ఆవరణలో మొక్కలు నాటించి, ఓజోన్ పొర ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొరను రక్షించుకోవడం మనందరి బాధ్యతని, లేకుంటే ఈ భూమిపై జీవం అన్నదే ఉండదన్నారు. జీవరాశి మనుగడకు పరోక్ష కారణం ఓజోనే అన్నారు. ఆ పొర లేకపోతే భూమి అగ్నిగోళంలా మండుతూ ఉండేదన్నారు. 1980లో మొదటిసారి ఓజోన్ పొరకు కన్నం పడిన విషయాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారన్నారు. చెట్లు నరికే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం బలమైన చట్టాలు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వినూత్నంగా ఓజోన్ ఆవశ్యకత

మండలంలోని నెత్తంకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓజోన్ పొర ఆవశ్యకతను విద్యార్థులు వినూత్నంగా తెలియజేశారు. ఓజోన్ ఆకారంలో, ఓ3 ఆకారంలో కూర్చున్న వారు ఓజోన్ పొర ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్ మాట్లాడుతూ ఓజోన్ పొర సూర్యునికి, వాతావరణానికి మధ్య రక్షణగా ఉంటూ అతినీలలోహిత కిరణాలు భూమిపైకి రాకుండా కాపాడుతుందని వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు



ఓజోన్ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



ఓ3 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మూతబడిన సచివాలయం తలుపులు



ఉదయం 11 గంటలకు మూతబడి ఉన్న నరసింహపురం గ్రామ సచివాలయం

పాలసముద్రం: మండలోని నరసింహపురం గ్రామ సచివాలయం మంగళవారం 11 గంటలైనాలుపులు తెరవలేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు సైతం సమయపాలన పాటించడం లేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు 11 గంటలైనా సచివాలయం తలుపులు తెరచుకోలేదని విసిగిపోతున్నారు. నరసింహపురం గ్రామ సచివాలయం పది రోజులుగా ఉద్యోగులు ఎప్పుడు వస్తారో పోతారోనని గ్రామ ప్రజలకు తెలియడం లేదు. ఇప్పటికైనా జిల్లా, మండల స్థాయి అధికారులు సచివాలయాలపై పర్యవేక్షణ పెంచి ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోరాట ఫలితమే అంగన్‌వాడీ జీఓ

– విజయోత్సవంలో అంగన్‌వాడీలు



కార్వేటినగరంలో విజయోత్సవాల్లో అంగన్‌వాడీ వర్కర్లు

కార్వేటినగరం: మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా చేయాలని 42 రోజుల సమ్మె పోరాట ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం ఆలస్యంగా జీఓ ఇచ్చారని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు అన్నారు. మంగళవారం కార్వేటినగరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద అధ్యక్షురాలు విజయ, కార్యదర్శి మమత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సమావేశంలో సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఐక్యంగా చేసిన పోరాట ఫలితంగానే మినీల జీఓ సాధించామన్నారు. ఇది అందరి విజయమని చెప్పారు. జిల్లాలో కొన్ని ప్రాజెక్టులు అధికారులు, డబ్బులు తీసుకుని అర్హులను అనర్హులుగా చేయడం బాధాకరమన్నారు. అలాంటివి క్షుణ్ణంగా పరిశీలించి అందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్ర మహాసభలు ఒంగోలులో ఈ నెల 20, 21వ తేదీలలో జరుగుతాయని, వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాలు వెంటనే అమలు చేసి మెయిన్ వర్కర్‌గా చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కూడా అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా అందరూ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రాజెక్టు నాయకులు లక్ష్మీనరసమ్మ, రెడ్డెమ్మ, యువరాణి, భాను, నాగమ్మ, రాణి, విజయ, వలెమ్మ, మినీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వాన్నంగా రహదారులు

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

పాలసముద్రం: మండలంలో రోడ్లు పరిస్థితి దయనీయంగా మారింది. వర్షానికి రోడ్లు పెద్ద గుంతలుగా ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. బలిజకండ్రిగ–చిత్తూరు జాతీయ రహదారి ఏట్టుకూరిపల్లె గ్రామం సమీపంలో రోడ్డు దెబ్బతిని గుంతలు పడిపోయింది. వర్షం పడితే రోడ్డులోనే నీరు నిలిచి పోతుంది. వాహనదారులు ఎక్కడ గుంట ఉందో ఎక్కడ రోడ్డు బాగుందో తెలియని పరిస్థితి నెలకొంది. బలిజకండ్రిగ–చిత్తూరుకి ప్రతి 30 నిమిషాలకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. బెంగళూరుకి ఆరు బస్సు సర్వీసులు కూడా ఉన్నాయి. రాత్రి పూట ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించబోయి గుంతల్లో పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. కన్నికాపురం సమీపంలో వర్షపు నీరు రోడ్డుపై నీరు నిలిచి పెద్ద గుంత అయిపోయి చెరువును తలపిస్తోంది.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

గత ప్రభుత్వ హయాంలో తుపాను ప్రభావంతో ఇలాగే రోడ్లపై వర్షపు నీరు నిండిపోయింది. ఆ సమయంలో గంగాధరనెల్లూరు జనసేన పార్టీ ఇన్‌చార్జి యుగంధర్ రోడ్డుపై ఉన్న వర్షపు నీటిలో వరిపైరు నాటి, నిరసన వ్యక్తం చేశారు. ఇప్పుడు రోడ్లుపై నిలిచిన వర్షపు నీటిలో ఎందుకు వరి పైరు నాటడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆయనకు రోడ్ల దుస్థితి కనబడడం లేదా మండల ప్రజలు వాపోతున్నారు.



వర్షానికి గుంతలమయంగా మారిన రోడ్డు



పాలసముద్రం సమీపంలో వర్షానికి చెరువులా మారిన రోడ్డు

గుంతలమయం

కార్వేటినగరం: గత కొన్ని సంవత్సరాలుగా ఆర్కేవీబీ పేట దళితవాడ సమీపంలో ఉన్న బీటీ రోడ్డు దుస్థితికి చేరుకుని గుంటను తలపిస్తోంది. ఆదమరచి రోడ్డే కదా అనుకుని ప్రయాణిస్తే ప్రమాదాలు తప్పడం లేదు. మండలంలోని ఆర్కేవీబీపేట గ్రామానికి, దళితవాడకు మధ్యలో నిర్మించిన బీటీ రోడ్డు కంకర తేలి, మట్టి కొట్టుకు పోవడంతో దుస్థితికి చేరుకుని, సుమారు మూడు మీటర్ల వరకు రెండు అడుగులకు పైనే గుంత ఏర్పడడంతో వర్షాలకు గుంటను తలపిస్తోంది. ఆ విషయం తెలియని వాహనదారులు ఆదమరచి ఆ మార్గంలో ప్రయాణిస్తే ప్రమాదాలు తప్పడం లేదు. ఇప్పటికే సుమారు 20 మందికి పైగా ప్రమాదాలకు గురై గాయాల పాలయ్యారు. అదే విధంగా రోడ్డుపై నిలిచిన మురుగునీటిలో దోమల బెడద ఎక్కువ ఉండడంతో రోడ్డు పక్క నివాసాలు ఉంటున్న వారు రోగాలబారిన పడుతున్నారు. గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వంలో పంచాయతీ నిధులతో గుంతలకు మట్టి పోసి ప్రయాణాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. అయితే మండలంలోని కొందరు టీడీపీ నాయకులు మట్టిని తొలగించి వర్షపు నీటితో నింపి చెరువును తలపిస్తోందని చేపలు పట్టినట్లు ఫొటోలకు పోజులు ఇచ్చి, తమ ప్రభుత్వం వస్తే రోడ్డుకు మహర్దశ కల్పిస్తామని బీరాలు పలికారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్నది టీడీపీ ప్రభుత్వమే కదా రోడ్డు దుస్థితికి చేరుకుంది టీడీపీ నాయకులకు తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. నిత్యం వాహనాలు, బస్సులు ప్రయాణించే రోడ్డును మరమ్మతులు చేపట్టి, ఆ మార్గానికి పూర్వ వైభవం తీసుకు రావాలని స్థానికులు కోరుకుంటున్నారు.



ఆర్కేవీబీపేట వద్ద గుంటను తలపిస్తున్న బీటీ రోడ్డు